వెంకన్న మస్తుగా త్రాగి డ్యూటీలో కొచ్చాడు. వాడు త్రాగినందుక్కాదు. మాట తప్పినందుకు నాకు మహా చెడ్డ కోప మొచ్చింది.

'గెటవుట్ ... రాస్కెల్...' అంటూ గట్టిగా అరిచాను. వాడంతటితో వెళ్ళి పోయినా బాగుండేది. ఏదో చెప్పబోతుంటే మరీ రెచ్చిపోయాను.

మెడమీద చెయ్యి వేసి ఒక్క తోపు తోశాను. వెంకన్న బిక్కబిక్కటుగా ఏడిపో యాడు. ఆఫీసులో అంతా మూగారు. సాను భూతి వెంకన్న మీదున్నా అంతా నన్నే సపోర్టు చేశారు. వెంకన్నకేం దెబ్బ తగ్గ లేదు. కాని ఈ సంఘటన నన్ను గాయ పరచింది.

అసలు వెంకన్నను శిక్షించడానికి నే నెవర్ని? నీతి నియమాల పరిరక్షణకు నేనేమీ కంట్రాక్టు తీసుకోలేదుగా? వెంకన్న ఆఫీసు డ్యూటీలో నాబంట్రోతు. డ్యూటీలో అవకతవక లేనంతకాలం వెంకన్న త్రాగితేనేం? తైతెక్కలాడి తేనేం? తోటి మానవుణ్ణి శిక్షించే అధి కారం నా కెక్కడిది?

నా ప్రవర్తనకు నేను మనసులో క్షమాపణ చెప్పుకున్నాను. కాని పైకి ఆమాట చెప్పలేకపోయాను. నా హోదా అడ్డొచ్చింది. ఒక బంట్రోతుకు క్షమా పణ చెప్పుకోవడమా?

ప్రపంచ జ్ఞానం తెలియకముందు త్రాగడం ఒక ఖరీదైన లగ్జరీ అనుకునే వాణ్ణి. ఎగ్జిమాలాగా డబ్బుగలవాళ్ళ సొత్తనుకునేవాణ్ణి.

దరిద్రులూ త్రాగుతున్నారు. వాళ్ళ మాటేమిటి?

రోజంతా యిదే ఆలోచనలో, బుర్ర వేడెక్కిపోయింది. సాయంత్రం అలా పార్కువైపుకు నడిచాను. అక్కడా వెంకన్న ప్రత్యక్షం. బెంచిమీద పడుకుని షూనిరాగాలు తీస్తున్నాడు. ప్రపంచం ఏమయిపోయినా తనకు ఫికరు లేనట్లుగా వున్నాడు. నిజం చెప్పాలంటే మామూలు స్థితిలో పొందలేని ఆనందాన్ని యిప్పు డనుభవిస్తున్నాడు.

ఆఫీసుకాదు గనుకా, అహం అప్పటికే వచ్చి వుండటం వల్లా వెంకన్నను ఆస్థితిలో పలుకరించడానికి నాకభ్యంతరం లేకపోయింది.

'వెంకన్నా పిల్లలంతా కులాసాయేనా?'



# భయపెట్టాను అంతే!

వెరికన్నా నా వంక చూశాడు. ఆస్థితిలో కూడా నాతో మర్యాదగా ప్రవర్తించడం నాకాశ్చర్యం కలుగజేసింది.

బాగా నిషాలో వున్నందువల్ల వెంకన్న మాటల్లో ఒక సీక్వెన్సు లేదు. కాని చెప్పింది కుండబద్దలు గొట్టి చెప్పాడు. మాట్లాడిందాన్లో సగానికి పైగా బూతులు. అయినా ఎంతో వేదాంతం వుంది. చెప్పింది మోటుగా చెప్పినా నిజం చెప్పాడు. గుండెల్ని మండించే నిజం చెప్పాడు. సంఘం మీద తన అక్కసు తీర్చుకున్నాడు. ఆవేదనంతా వెళ్లగక్కాడు.

వెంకన్న చెప్పిందంతా కలగాపులగం. బూతుల్లో వేదాంతం. వేదాంతం మధ్య సంఘం మీద కసి. ఇంతలోనే జీవితం మీద విసుగు. సముద్రపు అలల్లా హెచ్చులూ, తగ్గులూ. అందుకే ఎడిటింగ్ అవుసరం. వెంకన్న మిగతా క్షోభనంతా ఒక ప్రక్కకు నెట్టి, అసభ్యపు మాటల్ని సెన్సార్ చేసి కావలసినంత మటుకే నా మాటల్లో చెబుతాను.

'పిల్లల్నమ్ముకోడం మీ రెన్నడైనా విన్నారా?' వెంకన్న ప్రశ్నించాడు. పుస్తకాల్లో చదివాను: విన్నాను కూడా. ఆ మాటే చెబితే వెంకన్న టాపిక్‌మార్చి మరోసంగతి చెప్పే ప్రమాదం వుంది. అందుకే 'విన్లేదు' అనేశాను గబుక్కున.

'నేనమ్మాను నా పన్నెండేళ్ల కొడుకుని సాలుకు వందరూపాయల కమ్మేశాను'

'బుద్ధిలేని వెధవలు సంతానం తగ్గించుకో మంటారు. ఎందుకూ? సంతానాన్ని డబ్బు కిందికి మారిస్తే? బోలెడు గిరాకీ. ఏ క్షణంలోనైనా అమ్మెయ్యొచ్చు. కొనడానికి బోలెడుమంది. పదిమంది పిల్లలుంటే వాళ్ళ తలో వందా సాలుకి తెస్తుంటే తల్లిదండ్రులకు లాభం కాదూ? ఇంతకీ పిల్లల్ని కనడానికి మనమేం కష్టపడనక్కర్లేదుగా? ఒకప్పుడు నా అభిప్రాయం.

నాకు ఆరుగురు సంతానం. నా పెళ్లాం ముప్పయ్యేళ్లకే ముసిల్దయి పోయింది. మాయింటి దానితోటిది రత్తమ్మ యిప్పటికీ పిటపిట లాడుతోంది.

మాచంటోడి పుటకలకి నా పెళ్ళాం జబ్బడి పోయింది. అసలు చచ్చి పోవలసిందే. డాక్టరు నన్ను పిలిచి చివాట్లు పెట్టాడు. మరోపిల్ల పుడితే నా పెళ్లాం నాకు దక్కదన్నాడు. అప్పుడర్థమయింది. పిల్లల్ని కనడం మగాడికెంత తేలికో ఆడదానికంత రాపిడని. డబ్బులేకపోతే మరీను.

జబ్బుపడ్డ మా యింటిది తిరిగి మనిషి కాలేదు. నాకు కష్టాలు మొదలయినవి. ఎవరో అన్నట్టు కష్టాలు వస్తే గుంపులు గుంపులుగా వస్తవి. ఒంటరిగా రావు.

నాజీతం మీకు తెలుసుగా? ఆ జీతంతో యింతమందిని పోషించడం మానవుడి తరమా?

అందుకే అప్పులు చేశాను, తీరుద్దామనే సరుద్దేశంతోనే. కాని తీర్చలేకపోయాను. క్రమంగా నా జీతంలో సగం పైగా వడ్డీలక్రిందే కాబూలీ వాళ్లకు పోతుండేది: నా పరిస్థితి అధ్వాన్నం అయిపోయింది. ఇంటికి వెళ్లడానికే రాను రాను భయమేస్తోంది. తిండిలేకమాడుతున్న సంతానం — జబ్బుతో కృశించిపోతున్న భార్యా—అప్పులబాధ.

'ఇలాంటి పరిస్థితి మీ కెన్నడైనా కలిగిందా?' నన్ను ప్రశ్నించాడు.

'వద్దు...వద్దు...పగవాడిక్కూడా వద్దు' అన్నాడు మళ్లీ తనే.

'కృశించి పోతున్న పిల్లల్ని చూడలేక రెండు మూడిళ్లలో పనిచెయ్యడం మొదలెట్టింది నా భార్య. కడుపుతీపి అలాటిది. రోజూ ఎంతో కొంత చద్దన్నం పిల్లలకు దక్కుతుండేది. పిల్లలు తింటున్నప్పుడు ఆ తల్లిపొందే ఆనందం ఎవరు వర్ణించగలరు?

'నాకు త్రాగుడలవాటయింది. కాదు చేసుకున్నాను. సరదాకోసం కాదు. నిజపరిస్థితుల్ని ఎదుర్కోలేక చాటుగానైనా సుఖపడాలనే స్వార్థంకొద్దీ. నిజం చెప్పాలంటే త్రాగుడు మొదలెట్టాక సుఖపడుతున్నాను. గవర్నమెంటు తిండి పెట్టకపోతే పోయె. ఎవరిమానాన వాళ్లని బ్రతకనివ్వదు. త్రాగడం మంచిదిగాదని నిషేధించారు.

'అమ్మ పెట్టాపెట్టదు. అడుక్కుతినా నివ్వదు.'

'నాభార్య ఒకరోజు హఠాత్తుగా ఒక కబురు తెచ్చింది. దీనమైన కళ్లు వాడిపోయిన ముఖం, ఆమె హృదయంలోని సంఘర్షణకు నిదర్శనాలు.'

'రావుణ్ణి పన్లో పెడదామా?' అడిగింది.

'నీకు మతిగాని పోయిందా? ఆడికెన్నేళ్లూ?'

'పన్నెండు రేపు సంకురాత్రికి నిండుతాయి.'

'పన్నెండేళ్ల వాడు, తనపని తాను చేసుకోవడమే రానివాడు మరోయింటికి చాకిరీకి వెళ్లడమా? నా కడుపున పుట్టబట్టేగా ఈ అన్యాయం? నేనేం మేడలు కావాలన్లేదు. కార్లు కావాలన్లేదు. కలిగిన వాళ్లతో సమంగా వుండాలనడానికి నేనేమీ కమ్యూనిస్టుని కాదు. కనీసం కన్నకొడుకుని వయసొచ్చే వరకూ నాదగ్గరుంచుకునే అదృష్టం కోరుకోవడంకూడా తప్పేనా? ఇంతకన్నా పశులు నయం, జంతువులు నయం.'

నా భార్య వివరించింది.

'నేను పనిచేసే యింటివారి బంధువులకు పనికుర్రవాడు కావాలట. వాళ్లకు గుంటూర్లో పుగాకు కంపెనీ వుందట. తిండీ, బట్టాయిచ్చి సాలుకి వంద రూపాయలక్కూ దిర్చాను!' అంది.

'నన్నడక్కుండా ఎందుకు మాటిచ్చావు? అంతా నీ యిష్టమేనా?' గట్టిగా అరిచాను.

నాకోపం కట్టలు తెగింది.

'మరేం చెయ్యమంటవు? ఒకడిబరువు తగ్గినా తగ్గినట్టేగా?'

'నా చెంప చెళ్లుమనిపించినట్లయింది. ప్రయోజకత్వం లేకపోయినా మగాణ్ణి అనే అహంభావం నన్ను పశువుని చేసింది. విచక్షణ లేకుండా యిష్టమొచ్చినట్లు బాదేశాను. రావుడు అడ్డుకోక పోతే ప్రాణంతీసి వుండేవాణ్ణి. వాడు ఏడుస్తూ 'అయ్యా... అయ్యా... అమ్మను కొట్టొద్దే' అనడం ఎల్లప్పుడూ నా చెవుల్లో గింగిరు మంటూ వుంటుంది. ఈ సంఘటన నా జన్మలో మరువలేను. నా తెలివితక్కువ కాకపోతే తల్లికంటే వాడిమీద నా కెక్కువ ప్రేమా? గుండెల్లో ఎంతబాధను దాచుకుంటూ ఆ నిర్ణయాని

కొచ్చిందో నాకెందుకర్థం కాలేదు? అప్పుడర్థమయింది అవసరమైతే ఆడది ఎంత కఠినంగానైనా మారగలదు.'

'ఆ సాయంత్రం నేనే తీసుకెళ్లి రావుణ్ణి గుంటూర్లో విడిచి పెట్టొచ్చాను. పెద్ద బంగళా. ఇంటిముందు పెద్ద తోటా. వేరే నౌకర్లున్నారు. రెండు మూడు కార్లున్నాయ్. ఒక చిన్న సంస్థానం లాగుంది.

'బుద్ధిగావుండి ఇంట్లో అతుక్కుపోతే నీ కొడుకుని మనిషినిచేసే పూచీ నాది' అంది ఇంటావిడ. మనిషిని చెయ్యడమంటే ఆవిడ దృష్టిలో నమ్మకమైన నౌకర్ని చెయ్యడం అన్నమాట.

'అంతా మీ దయ. మీ చేతుల్లో పెడుతున్నాను. కన్నబిడ్డలా చూసుకుంటారని' అన్నాను వుండబట్టలేక. నా మాటలు నాకే అసహజం అనిపించినవి. కన్నవాణ్ణి నేనే బరువు మొయ్యలేక మరొకరి దయా దాక్షిణ్యాల మీద వొదిలేస్తుంటే వాళ్లకేం పట్టింది? వాళ్లకు పిల్లల్లేరా? లేకపోతే మటుకు నాలాటి భికారిగాడి పిల్లలే కావాలా?

శేరుపాలు కుక్కకు పోసిందావిడ నా యెదుటే. దాన్లో వందోవంతు కనికరం రావుడిమీద చూపిస్తే చాలనుకున్నాను.

'నా కొడుకుని ఆ విధంగా అమ్ముకున్నాను.'

'ఆరాత్రి మా యింటిది తనివితీరా ఏడ్చింది. వోదార్చడానికి నేను ప్రయత్నించలేదు. గుండెల్లో బరువు తగ్గించుకోవాలంటే రెండే రెండు మార్గాలు. బాగా నవ్వడం లేదా బాగా ఏడవడం. మా బ్రతుకులకు నవ్వే అదృష్టం లేదు గనుక ఏడుపే శరణ్యం.' వెంకన్న కొంచెంసేపాగి మరల ప్రారంభించాడు.

'మీకు గుర్తుందా? చిన్నబాబుగార్ని అదేదో స్కూల్లో వొదిలేసిన కొత్తలో అమ్మగారెలా బాధపడేవారో?'

ఇక్కడ నా స్వంత విషయం రెండు ముక్కలు చెప్పాల్సివుంటుంది. మా రెండోవాణ్ణి సైనిక్‌స్కూల్లో చేర్పించినపుడు వాడికి పదోయేడు. స్కూల్లో చేర్పించి నా భార్యా నేను తిరిగొచ్చాము. నా భార్య వారంరోజులు నిద్రపోలేదు. నన్ను నిద్రపోనియ్యలేదు. బయటి వ్యాపకాలనేకం వున్నవాణ్ణి గాబట్టి నా కాట్టే యిబ్బంది లేకపోయింది. కాని ఆవిడ పరిస్థితి వర్ణించలేము. ఎంతసేపూ ఏదో వెలితి ఫీలయ్యేది. వుండుండి వులిక్కిపడేది. వాడొచ్చి కళ్లుమూసినట్లూ, మారాం చేస్తున్నట్లూ, అన్నం దగ్గర పేచీ పెట్టుకుంటున్నట్లూ ఫీలయ్యేది. తనలో తాను 'చిన్నా' అనుకోవడం నేను చాలసార్లు విన్నాను. నాకు జాలివేసింది. చేర్పించిన వారం రోజులు తిరక్కుండానే తీసుకెళ్లి చూపెట్టి వచ్చాను. అప్పటికి గాని మనిషవ్వలేదు. క్రమంగా సర్దుకోవడానికి సంవత్సరం పైగా పట్టింది. ఇప్పటికి మూడు సంవత్సరాలైనా అన్న రోజుకి వాడి దగ్గర్నుండి వుత్తరం రాకపోతే తల్లడిల్లిపోతుంది. తల్లి హృదయం అలాటిది.

ఇంతకూ నేను చెప్పదలచుకున్నదేమంటే ఈ అనుభూతికి హెచ్చు తగ్గులు లేవు ... గొప్పా తక్కువా భేదం లేదు. కొడుకు నొదిలి నా భార్య ఎంత బాధ పడిందో రావుడి తల్లీ అంత బాధ పడుంటుందనే నేను చెప్పదలచుకుంది.

వెంకన్న ప్రారంభించాడు.

'రెండులనెలు గడిచాయి. నా పెళ్లాం పోరు భరించలేకపోయాను. చివరకు నన్ను నిందించడం ప్రారంభించింది. నా పెళ్లయి పదిహేనేళ్లయింది. నన్నెప్పుడూ దూషించి యెరుగదు. అలాటిది నన్ను దూషించడం మొదలుపెట్టింది. అందుకే రావుణ్ణి చూడ్డానికి వెళ్లాను. ఇద్దరం వెళ్లడానికి డబ్బెక్కడిది?'

ఇంటి యజమాని నన్ను చూసి—

'ఎవర్నువ్వు?'

'రావుడి తండ్రినండి'

'ఎవడా రాముడు?'

నాకు భయం వేసింది. నేను గుటకలు మింగుతుంటే కారు డ్రైవరు చెప్పాడు:

'మనింట్లో పని కుర్రాడండి.' అని.

'అలాగా?' అంటూ కారు స్టార్టు చేసుకుని వెళ్లిపోయారు.

'కొడుకుని చూడ్డానికి వొచ్చావేమిటోయ్' ఇంటావిడ పలుకరించింది.

'అవునమ్మ! గుంటడెలాగున్నాడో చూసిపోదామని' నసిగాను.

'వాడికేం? పోతులాగున్నాడు. పనిపాటు లబ్బడం లేదుగాని.'

ఇంతలో రావుడొచ్చాడు. ఏ మాటకామాట చెప్పుకోవాలి మా యింట్లో కన్నా నున్నగా వున్నాడు.

'అయ్యా!' అంటూ వచ్చి నా వొళ్లో వాలిపోతాడనుకున్నాను. వాడి తల్లీ, తమ్ముళ్లగురించి ఆత్రంగా అడుగుతాడనుకున్నాను. ఏమీ లేదు. కళ్లనిండా నీళ్లు నింపుకున్నాడు. దగ్గరకి రాడు. నాకూ దుఃఖం ముంచుకొచ్చింది. ఇంటావిడ ఇంట్లోకి వెళ్లింది.



రావుడు పరుగెత్తుకొచ్చి నా వొళ్ళో వాలిపోయాడు. ఆ యనుభూతి అనుభ వించిన వాళ్ళకే తెలుస్తుంది.

'రావుడూ రెండుకిలోల మాంసం పట్టుకురా' ఇంటావిడ సంచీ డబ్బా యిచ్చింది.

వాడితో స్వేచ్ఛగా మాట్లాడుకునేందుకు అవకాశం చిక్కింది.

'నువ్వుకూడా రా' అన్నాడు రావుడు. ఇప్పటికి వా డి క ళ్ళ లో వెలుగు కనిపించింది.

దారిలో మే మెక్కువగా మాట్లాడుకో లేదు. దగ్గరగా వున్నా మాయిద్దరి మధ్యా ఎంతదూరం ?'

బందిఖానాలో ప్రేమ మొద్దుబారి పోతుంది. తండ్రీ కొడుకులను జెయిల్లో పెట్టి పదేళ్ళుంచండి ? ప్రేమ పెరక్క పోగా నశించిపోతుంది.

దారిలో వాడి త మ్ము ళ్ళ గురించీ, వాళ్ళమ్మగురించీ అడిగడు. ముసి ముసి నవ్వులు నవ్వుకున్నాడు.

రాత్రి రావుడు పళ్ళెంలో అన్నం తీసుకొచ్చి ముందుపెట్టాడు.

'నువ్వూ ?'

'తరవాత తింటాలే'

భోజనం బా గుం ది. ఒక కూరా, పులుసూ, మజ్జిగ, నా యింట్లో యింత వైభోగం ఏక్కడిది ?

# భయపెట్టాను అంతే!

రాత్రి పదింటికొచ్చాడు రావుడు పడుకోడానికి.

ఇంటివారి చంటోడు వీణ్ణొదిలి ఒక్క క్షణం వుండడు. రెండు నెలల్లో యింత అతుక్కుపోడం పిల్లల్లోనే జరుగుతుంది.

గారేజిలో పడుకున్నాము. నాకెందుకో అనుమానం వేసింది. రావుడు తిండి తిన్నట్టులేదు. వాడికళ్ళే చెప్పాయో తండ్రినిగాబట్టి నాకు తెలిసిందో నాకు తెలియదు. ముందు అన్నం తిన్నానన్నాడు. తరువాత ఆకలి కావడం లేదన్నాడు. చివరికి నిజం చెప్పాడు. అన్నం లేదు.

తనవంతు నాకు పెట్టాడన్నమాట. అన్నం ఎలా మిగుత్తుంది? వంటవాడు వండడు. రావుడికి అడిగే ధైర్యంలేదు. ఇంటావిడ కిలాటివి పట్టవు.

అవును నే నెవణ్ణని అజ కనుక్కోవాలి? నే నేమైనా చుట్టాన్నా? స్నేహితుణ్ణా? నౌకరు తండ్రిని. నౌకరు తండ్రిని అజ కనుక్కునే మంచితనం ఈ రోజుల్లో ఆశించేంత మూర్ఖుణ్ణి కాను.

'రావుడింత హుషారుగా వుండటం నే నెన్నడూ చూ శ్ళే దు. ఎప్పుడూ వుసూరుమంటూ వుండేవాడు.' ఒకనౌకరు అన్నంతింటూ చెబుతున్నాడు మరొకడితో.

'అడి బాబొచ్చాడుగదరా?' మరొకడి సమాధానం:

రావుడు హాయిగా నా ప్రక్కలో నిద్ర పోయాడు. నేను నా దురదృష్టాన్ని తిట్టుకున్నాను. నా ప్రయోజకత్వాన్ని నిందించుకున్నాను. రావుడికి తిండి పెట్టలేక అమ్ముకున్న తండ్రిని, చివరికి వాణ్ణి మాడ్చి వాడి తిండితినే దౌర్భాగ్యం కలిగినందుకు నామీద నాకే అసహ్యం వేసింది.

తరువాత రెండుమూడుసార్లు రావుణ్ణి చూడ్డానికి వెళ్ళాను. ఎన్నడూ తిండి కాదుగదా పచ్చి మంచినీళ్ళు ముట్టలేదు. రావుడు చిన్న బుచ్చుకుంటున్నాడని నాకు తెలుసు. నేను తింటే వాడు పొందే ఆనందంకన్నా వాడితిండి తిన్నందుకు నేను పడే వ్యధ అనేక రెట్లెక్కువ. అందుకే వాడికా కాస్త ఆనందంకూడా దక్కనియ్యలేక పోయాను.

ఒకసారి ఇంటావిడ నన్ను గట్టిగా హెచ్చరించింది.


'మాటిమాటికీ యిలా వస్తూవుంటే కుర్రాడు బెంగెట్టుకోడూ?' నా చెంప చెళ్ళుమనిపించినట్లయింది. దీనర్థం నా కొడుకుని చూసుకోవద్దనేగా? ఇదేం న్యాయం? ఒక తల్లి అనవలసిన మాట లేనా యివి? మాతృత్వాన్నికూడా మరచి పోయేంత పైశాచికత్వం మనుష్యుల్లో ఎలా ప్రవేశిస్తుంది? రావుడూ ఒక తల్లి కొడుకనీ, తను పడ్డంత ప్రసవవేదన ఆతల్లి పడుంటుందనీ, బిడ్డలవల్ల తాను పొందుతున్న ఆనందపు తరంగాలన్నీ రావుడి తల్లి పొందివుంటుందనీ ఎందు కనిపించదు? అనిపించదు. డబ్బు అనిపించనివ్వదు. భ గ వం తు డా! ఈ డబ్బనేది లేకపోతే మానవుడింత దిగజారి పోయివుండేవాడు కాదేమో?'

వెంకన్న కొంచెంసేపు మాట్లాడలేదు. తనలో తాను ఘర్షణ పడుతున్నట్లు వాలకం చెబుతోంది. ముఖం నల్లబడి చావుకళొచ్చింది.

'నిన్న ఈ వుత్తరం వచ్చింది'అంటూ వొక కార్డు తీసి నాకిచ్చాడు.

'నీ కొడుకుని వెంటనే తీసుకు పో. వివరాలు నీకే తెలుస్తవి.'

రెండే రెండు ముక్కలతో ఎవరో వ్రాశారు. బహుశా రావుడు పనిచేస్తున్న మరో నౌకరయివుండాలి.



'ఏదో కీడు జరిగిందని నా మనసు కనిపించింది. నా కాళ్లు నిలువలేదు. అందుకే యింట్లో చెప్పకుండా శెలవు చీటీకూడా ఆఫీసులో యివ్వకండా వెళ్లిపోయాను.'

శెలవుపెట్టకండా గైరుహాజరయినందుకు నేను వెంకన్నకు నాగా వేశాను. డిసిప్లిన్‌కు విరుద్ధంకదూ మరి?

'నేను వెళ్లేసరికి రావుడు గరేజిలో ఒకమూల మునగదీసుకు పడుకున్నాడు.'

'రావుడూ!' అన్నాను. నా గొంతు జీరబోయింది!'

'అయ్యా!' అంటూ రావుడు కదిలాడు!

'ఏం జరిగిందిరా?' ఆత్రంగా అడిగాను. రావుడు సమాధానంగా మూలిగాడు. నుదుటిమీద చెయ్యివేసిచూశాను. వొళ్లు మాడిపోతోంది. వీపుమీద చెయ్యివేసి దగ్గరకు లాక్కున్నాను.

'అబ్బా! అంటూ బాధగా మూలిగాడు రావుడు. చొక్కా తప్పించి చూశాను.'

'వాతలు...ఒకటికాదు...రెండు కాదు... పన్నెండు వాతలు...'

'నేనింకా తేరుకోకముందే యింటావిడ విరుచుకుపడింది.

'నీ కొడుకేంచేశాడో తెలుసా?' నేను సమాధానం యిచ్చేస్థితిలో లేను!

'సాయంత్రం వేళ బాబుని తోపుడుబండిలో వేసుకుని అలా తిప్పకు రమ్మన్నాను. అదీ కష్టమే? నీ కొడుకు ఆటల్లోపడి బండిని నడిరోడ్డుమీద వొదిలేశాడు. ఇంకా నయం. గండం తప్పింది. సైకిలయిపోయిందిగాని అదే కారయినా అంతేగా? అదృష్టం బాగుంది గనుక మాబాబు దక్కాడు.' ఇంతలో బాబుని మరొకడు ఎత్తుకుని తీసుకొచ్చాడు. దెబ్బలేం తగిలినట్టులేదు. హమ్మయ్య! అనుకున్నాను. అభియోగాన్ని ఎదుర్కునే ధైర్యం వచ్చింది.

'నౌకర్లంటే అంత అజాగ్రత్తగా వుంటే ఎలా? అందుకే కొంచెం భయపెట్టాను' ఇంటావిడ ముగించింది.

నాకు గట్టిగా అరవాలనిపించింది. ఆవర్ని కొట్టలేను గనుక నాతలను నేనే బాదుకోవాలనిపించింది. అల్లరి చెయ్యాలనిపించింది. నాకసి తీరేందుకు వేరే గత్యంతరంలేదనిపించింది.

'లావులూ!' బాబు పిలిచాడు చేతులూపుతూ.

రావుడు అంత బాధలోనూ చిరునవ్వునవ్వాడు.

బాబు పిలుపులో మాలిన్యం లేదు.

బాబు పిలుపులో శత్రుత్వం లేదు.

రావుడి నవ్వులో ప్రతీకారం లేదు.

ఈ సంఘటన నాకు వివేకాన్నిచ్చింది. ఏ అఘాయిత్యాన్నీ చెయ్యనియ్యకండా పట్టిలాగింది.

రావుణ్ని యింటికి తెచ్చుకుంటున్నాను. నౌకర్లలో ఒకడు పరుగెత్తుకుంటూవచ్చి నాకొక సలహా యిచ్చాడు.

'పోలీసు రిపోర్టిచ్చెయ్' అన్నాడు.

'పోలీసులు వాతలకు మందేస్తారా?' అన్నాను. నావైపు అదోరకంగా చూశాడు. మరల ఏదో చెప్పబోయాడు.

'వద్దు ...వద్దు' వారించాను.

వెంకన్న కొంచెంసేపాగి మరల ప్రారంభించాడు.

'త్రాగుడు గౌరవం కాదని నాకు తెలుసు కాని నేనేం చెయ్యను?

'త్రాగకపోతే యేనాడో ఆత్మహత్య చేసుకుని వుండేవాణ్ని. అప్పుడు నా పెళ్లాం పిల్లల గతేంగాను? త్రాగకపోతే యిన్ని కష్టాలు భరించే శక్తి ఎక్కడనుండొస్తుంది? పౌరుషంగా రావుణ్ని యింటికి తీసుకొచ్చాను. మందిప్పించడానికి దమ్మిడీ లేదు నా దగ్గర. అయినా హాయిగా నాకేం పట్టనట్టు తిరగ్గలుగుతున్నాను. ఇంట్లో తిండివుండదని నాకు తెలుసు. అయినా యింటిది ఎలాగో తంటాలుపడి గంజయినా పోస్తుందని నా దీమా. త్రాగకపోతే యింత బేఫికరుగా వుండేవాణ్ణా?' వెంకన్న ప్రశ్నించాడు.

వెంకన్న అభిప్రాయం తప్పు అని నిరూపించడానికి కావలసిన విజ్ఞానం నావద్ద లేకపోలేదు. కాని వెంకన్న అర్థం చేసుకునే స్థితిలో లేడు. పోనీ నేనైనా వెంకన్న నర్థం చేసుకున్నానా?

# రచయితలకు మనవి

## కథలు, వ్యాసాలు

ప్రచురణకి స్వీకరింపబడని తమ వ్రాతప్రతులని తిప్పిపంపగోరే రచయితలు వ్రాతప్రతులతోబాటే తగుమాత్రం తపాలాబిళ్లలు అతికించిన, స్వంత చిరునామాకల కవరు కూడా పంపాలి. స్టాంపులు మాత్రం పంపరాదు. స్టాంపులు మాత్రం పంపించినట్లయితే వ్రాతప్రతులు తిప్పిపంపబడవు. వ్రాతప్రతులతో గాక విడిగా స్వంత చిరునామా, తగుమాత్రం పోస్టేజికల కవర్లు పంపినా వ్రాతప్రతులు తిప్పిపంపబడవు.

ప్రచురణకి స్వీకరింపబడని వ్రాతప్రతుల విషయంలో యిటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

## నవలలు

ప్రచురణకి స్వీకరింపబడని నవలల వ్రాతప్రతులు మేమే తిప్పి పంపిస్తాము. వ్రాతప్రతులతో స్వంత చిరునామాకల, తగుమాత్రం పోస్టేజి అతికించిన కవర్లు పంప నవసరం లేదు. 100 అరఠావు పేజీల పయిన ఉన్న వ్రాతప్రతులే నవలలకింద పరిగణింప బడుతాయి.

## కార్టూన్‌లు

ప్రచురణకి స్వీకరింపబడని కార్టూన్‌లు తిప్పి పంపగోరేవారు కార్టూన్లతో స్వంత చిరునామాకల, తగుమాత్రం పోస్టేజి అతికించిన కవర్లు జతపరచి పంపాలి. స్టాంపులు మాత్రం పంపరాదు.

షరా: వ్రాతప్రతులని, కార్టూన్లని వీలయినంత భద్రంగా తిప్పిపంపే ప్రయత్నాలు చేస్తాము కాని, వాటి విషయములో యిటువంటి బాధ్యతని స్వీకరించలేము. ఈ షరతుని గమనించి రచయితలు తమ రచనలు, కార్టూన్‌లు పంపగలరు.

సంపాదకుడు
ఆంధ్రసచిత్రవారపత్రిక